# నిరాహారదీక్ష! (లేక బగారా బైగన్)



**మా**నిర్భయ్‌నగర్ కాలనీ ఎప్పుడూ ఏదొక సందడిగా ఉండటం మామూలేకదా!

అందులోనూ అలా వారానికొకసారయినా సందడిగా ఉండేట్లు చేయడం మా కాలనీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శాయీరాంకి మరీ సరదా!

వీధి కుక్కల్ని పట్టి బండిలోపడేస్తూ వేటాడే మున్సిపల్ బండిలాంటి ఆర్టీసి బస్సులోపడి అప్పుడే ఆఫీసు నుంచి ఇంటికి చేరుకున్నాను

స్నానం వగైరాలు ముగించి ఇలా 'టీ' తాగి అలా న్యూస్‌పేపరు పక్కింటాయనను అడిగి తెప్పించుకున్నానో లేదా శాయీరామ్ హడావుడిగా వచ్చేశాడు.

"త్వరగా పదగురూ! మీటింగుంది!" అన్నాడు గడపలో నిలబడి.

"మళ్ళీ ఏం మీటింగు?" చిరాకుగా అడిగాను.

"మన కాలనీ రోడ్డు అధ్వాన్నపు స్థితిని గురించి మనం తీసుకోవాల్సిన చర్యల కోసం మీటింగు ఏర్పాటు చేశాం కదా! త్వరగా పద! అందరూ వచ్చేశారు." ఇంక తప్పదని లేచి బయల్దేరాను.

అప్పటికే జనార్ధన్ మైక్ ముందు నిలబడి మాట్లాడుతున్నాడు.

"కాలనీ వాసులందరికీ నమస్కారం! సోదరులారా! మన కాలనీ రోడ్డు వేసి ఎంత

కాలమయిందో ఎవరికీ తెలీదు. పాతనైజాం స్టేట్ వాళ్ళు వేసిన నాటిరోడ్లని కొంతమందీ, కాదు, శ్రీకృష్ణదేవరాయలు వేయించిన రోడ్లని మరి కొంతమందీ, కాదు, ఆశోక చక్రవర్తి బాటకిరువైపులా చెట్లు నాటించే పథకం కింద ముందీబాట వేయించాడని ఇంకొంతమందీ ఇలా అనేకమంది అనేకరకాల అభిప్రాయాలు వెలిబుచ్చారు. కానీ ఇటీవల మనకాలనీ డిటెక్టివ్ సాహిత్యం రచయిత్రి రాజేశ్వరి గారు పరిశోధించి ఈ రోడ్డుని హైదరాబాద్ మునిసిపాల్ కార్పొరేషన్ వాళ్ళే వేశారనీ, అయితే అందుకు వాళ్ళు కాంట్రాక్టర్లకిచ్చి బిల్లులే ఆధారమనీ తేల్చారు. ఎందుకంటే ప్రస్తుతం ఆ రోడ్డు ఉండేచోట దిగుడుబావుల్లాంటి గుంటలు తప్పితే ఇంకేమీ కనపించటం లేదు. ఈ దారణమయిన రోడ్డుకి కనీసం రిపేర్లయినా చేయించమని మనం పెట్టుకున్న ఆర్జీల గురించి పట్టించుకునేవారే లేరు. అంచేత మనం ఏంచేయాలో నిర్ణయించడానిగ్గాను ఇక్కడ సమావేశమయ్యాం!

ఈ విషయంలో అందరూ తమ తమ అమూల్యమయిన సూచనలు అందించవలసిందిగా కోరుతున్నాము– జైహింద్!" అంటూ ఉపన్యాసం ఆపాడతను. ఎవరూ తప్పట్లు కొట్టలేదు.

"ఆ మధ్య రామంతపూర్ కాలనీవాళ్ళు ఇలాగే వాళ్ళ రోడ్డు రిపేరుకోసం నిరాహారదీక్షచేసి, సాధించారుకదా! మనం కూడా అదే చేద్దాం!" అన్నాడు గోపాల్రావ్.

"అవును! ఈ రోజుల్లో అదొక్కటే ఎఫెక్టివ్ మెథడ్" అన్నాడు రెడ్డి.

"అవునవును! అదే బెస్ట్" అంటూ అరిచారు ఇంకొంతమంది.

అప్పటికప్పుడే గోపాల్రావ్ సూచన ఏకగ్రీవంగా ఆమోదింపబడింది.

"ఇప్పుడు మనలో నిరాహారదీక్ష ఎవరు చేయలోకూడా మన నిర్ణయం తీసుకుంటే రేపే నిరాహారదీక్ష ప్రారంభించవచ్చు!" అన్నాడు శాయీరామ్ మైక్ ముందుకొచ్చి.

అందరూ మొఖమొఖాలు చూసుకున్నారు. పరిస్థితి గమనించి జనార్ధన్ మైక్ దగ్గర కొచ్చాడు. "మనలో ఎవరయినా వాలంటీర్లు నిరాహారదీక్షకోసం తమ పేర్లు ఇవ్వవలసిందిగా కోరుతున్నాం!" అన్నాడు చిరునవ్వుతో.

అందరూ ఎవరయినా పేర్లు ఇస్తున్నారేమోనని వెనక్కు తిరిగి చూశారు కాని ఒక్కడూ నోరు మెదపలేదు.

"కేవలం మగాళ్ళే నిరాహారదీక్ష చేయాలనేం లేదు, స్త్రీలు కూడా పాల్గొంటే బావుంటుంది!" అన్నాడు రెడ్డి. అయినా ఎవరూ ముందుకి రాలేదు.

"ఎవరో ఎందుకు? మన కాలనీ కమిటీ కార్యనిర్వాహకవర్గం వారందరూ చేస్తే సరిపోతుంది!" అనరిచాడు రంగారావ్ వెనకనుంచి.

నా గుండెలు ఝల్లుమన్నాయ్, గోపాల్రావ్, జనార్ధన్, శాయీరామ్ల మొఖాలు కూడా

పాలిపోయినయ్ గానీ అది కనిపించకుండా నానా తంటాలూ పడుతున్నారు.

"అవ్! జర కాలనీల పేరుగిట్ట ఉన్నోళ్ళు చేస్తేనే ఖదరుంటది!" అన్నాడు యాదగిరి.

అందరిలోకీ ముందు జనార్ధనే కోలుకున్నాడు.

"సోదరులారా! మేము నిరాహారదీక్షచేయటానికి మాకేం అభ్యంతరం లేదు! కానీ ఇక్కడో టెక్నికల్ డిఫికల్టీ ఉంది. అదేంటంటే వేరేవాళ్ళు ఎవరయినా నిరాహాదీక్ష ప్రారంభించినట్లయితే– మేము అధికారుల దగ్గరకూ, ఇతర రాజకీయ నాయకులు దగ్గరకూ, వెళ్ళి వత్తిడి తెచ్చి త్వరగా రోడ్ రిపేరు చేయించేందుకు వీలుంటుంది. కనుక మీలోనే ఎవరొకరు–" మళ్ళీ నిశ్శబ్దం.

రంగారెడ్డి మైకు ముందు కొచ్చాడు.

"ఇంతకాలం ఎన్నో ధైర్యసాహసాలకు పేరుపొందిన మన కాలనీలో నిరాహారదీక్ష జరిపేందుకు ఒక్క వ్యక్తి కూడా ముందుకు రావటం లేదంటే మన కాలనీకే అవమానం! నిజానికి నిరాహారాదీక్ష నేనంటే నేనని జనం ముందుకురావాలి!"

హఠాత్తుగా జనంలో తోపులాట కనిపించింది.

రెడ్డి ఆనందపడ్డాడు "ఆ! అదేమనక్కావలసింది. అదీస్పిరిట్ అంటే"

"ఆళ్ళు నేనంటే నేనని కాదు డకలాయిస్తున్నది. నువ్వంటేకాదు నువ్వని నూకుతున్రు" అన్నాడు యాదగిరి.

అరగంట గడిచిపోయింది. ఒక్కరుకూడా వేదికవేపు రావడంలేదు.

గోపాల్రావ్ మైకు ముందు కొచ్చాడు.

"సోదరులారా! మన కాలనీ యాక్టివ్ మెంబరయిన శ్యామల్రావ్‌గారిని నిరాహారదీక్ష చేయవలసిందిగా మీ అందరి తరుపున కోరుతున్నాను. ఎందుకంటే ఆయనకు రాజకీయాల్లో కూడా అనుభవం ఉంది గనుక!" అక్కడున్నవారి కరతాళధ్వనులు అకాశాన్నంటినయ్.

శ్యామల్రావ్ గాబరాగా నుంచున్న చోట నుంచే అరిచాడు.

"నాకు ఆనందమే కానీ– నేను ఇవాళ అర్జంటుగా ఖమ్మం వెళ్ళాలి"

"ఎందుకు?"

"అక్కడ మా తమ్ముడి పెళ్ళివుంది" అన్నాడతను.

"అదేమిటి? మీకెవరూ తమ్ముళ్ళు లేరని చెప్పారుగా."

"అది కేవలం ఈపాడు మతిమరుపువల్ల చెప్పి ఉంటాను! క్షమించండి! వస్తా! బస్సు టైమయింది" అంటూ అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

"పోనీరెడ్డిగారినే చేయమనండి" ఎవ్వరో అరిచారు జనంలోనుంచి. రంగారెడ్డి అదిరిపడ్డాడు.

"అయ్యా నాపేరు ఒకరుచెప్పేంతవరకూ కూడా నేను ఆగేవాడినికాదు అంత యిష్టం నాకు నిరాహారదీక్షలంటే! కానీ ఈ మధ్య మా డాక్టరుగారు నేను ప్రతి రెండుగంటలకు ఓసారి ఫలహారమో, భోజనమో చేయాలనీ లేకపోతే దారుణమయిన కడుపునొప్పి వస్తుందనీ చెప్పారు. అంచేత ఇలాంటి అద్భుతమయిన అవకాశం పోగొట్టుకుంటున్నందుకు నాకెంతో ఇదిగా ఉంది" అంటూ నెమ్మదిగా స్టేజిదిగి ఓ పక్కగా నిలబడ్డాడు.

జనార్ధన్ మైక్ ముందు కొచ్చాడు మళ్ళీ.

"సోదరులారా! ప్రస్తుత పరిస్థితిలో ఒకే ఒక మార్గం కనబడుతోంది. అదేంటంటే అందరి ఇళ్ళనంబర్లూ చీటీ మీదరాసి అందులో నుంచి ఓ చీటితీసి ఆ ఇంటినెంబరున్నవాళ్ళతో నిరాహారదీక్ష చేయించడం! ఎలా వుంది మన ప్లాను!"

అంతా "అద్భుతం" అంటూ తప్పట్లు కొట్టారు.

మరుక్షణంలో అందరి ఇంటినంబర్లూ చీట్లమీద వరుసగారాసి ఓ కుప్పగా పోశారు. ఓ ఆరేళ్ళకుర్రాడిని పిలిపించి ఆ పోగులోనుంచి చీటి తీయమన్నారు. అంతా నిశ్శబ్దం అలుముకుపోయింది. అందరి మొఖాల్లోనూ టెన్షన్! కుర్రాడు చీటి తీసి జనార్ధన్ కిచ్చాడు. జనమంతా ఊపిరి బిగపట్టి చూస్తున్నారు. శాయీరామ్ ఆ చీటి చూసి మైక్‌లో ఆ ఇంటినంబరు చదివాడు.

చదివిన మరుక్షణం జనం మధ్యనుంచీ దబ్బుమన్న శబ్దం వినిపించింది. అందరూ కోలాహలంగా అటువైపు పరుగెత్తారు. నేనూ పరుగెత్తి "ఏం జరిగింది?" అనడిగాను.

"ఎవరో పడిపోయారు!" అన్నాడు రెడ్డి. పడిపోయిన అతని ముఖంమీద నీళ్ళు కొట్లాక నీరసంగా లేచి నిలబడ్డాడు. అతనిని చూస్తూనే గుర్తుపట్టాను, వెంకట్రావ్! "ఇంటి నంబరు ఇంకోసారి చెప్పండి" అన్నాడతను నీరసంగా.

శాయీరామ్ ఇంటి నంబరు మళ్ళీ చదివాడు.

"ఎవరిదీ ఇంటినెంబరు?" అడిగాడు జనార్ధన్.

"మాదే!" అన్నాడు వెంకట్రావ్ నీరసంగానే.

"ఓహో అదా సంగతి! మరింకేం ఇలాంటి అవకాశం దొరికినందుకు ఆనందించక అలా కంగారు పడతావేమయ్యా. పద పద" అంటూ అప్పటికప్పుడే వెంకట్రావ్‌ని స్టేజీమీదకు తీసుకెళ్ళి అందరికీ పరిచయం చేశాడు గోపాల్రావ్.

"సోదరులారా! పువ్వు పుట్టగానే పరిమళించినట్లు, వెంకట్రావుగారికి చిన్నప్పటి నుంచీ కూడా నిరాహారదీక్షలంటే ఇష్టం అట. అలాంటి మహానుభావుడికే మళ్ళీ అలాంటి అవకాశం రావడం నిజంగా చాలా గొప్ప విషయం! చాలా అద్భుతమయిన విషయం! చాలా..." అని ఇంకేమీ పదాలు దొరకక "అంతే!" అన్నాడు. మీటింగ్ ముగిసిపోయింది.

వెంకట్రావ్ పైకి ధైర్యంగా ఉన్నట్లే కనబడుతున్నా, లోలోపల తెగ భయపడుతున్నట్లు కనిపించాడు. "షుమారుగా ఎన్నిరోజులు నిరాహారదీక్ష చేయాలంటారు?" అన్నాడు దిగులుగా.

"ఆ-ఎంత? నాలుగయిదు రోజులు- ఈలోగా మేము ఊరేగింపులు, ధర్నాలు జరిపి కనీసం వెంటనే రోడ్లపని మొదలుపెడతామన్న 'హామీ' అయినాతీసుకుని నిరాహారదీక్ష విరమింపజేసేస్తాం!"

"నాలుగు రోజులనేసరికి వెంకట్రావుకి ధైర్యం వచ్చేసింది.

"ఓశ్! ఇంతేనా! నాలుగయిదు రోజులు ఓలెఖ్ఖా ఏమిటి? ఎనిమిదేళ్ళ క్రితం నాకు జ్వరం వచ్చినప్పుడు పదిరోజులు తిండిలేకుండా గడపలేదా ఏమిటి?" అన్నాడ ఉత్సాహం తెచ్చుకుంటూ.

''అంతేకాదు! ఇంకో సంగతికూడా ఆలోచించు! నువ్వెలాగూ ఎలక్షన్లో నిలబడాలనుకుంటున్నావు కదా! దానికి ఇంతకంటే మంచి ఛాన్స్ దొరకదు. ఈ నిరాహారదీక్షతో నువ్వు పెద్ద పాపులర్ ఫిగరయిపోతావు ఈ ఏరియాలో! మన నాయకులు చాలామంది ఇలాగే కదా ఎన్నికయింది" అన్నాడు రెడ్డి ప్రోత్సాహం ఇస్తూ.

ఆమాట వెంకట్రావు మీద షార్ట్ సర్క్యూటింగ్‌లాగా పనిచేసింది.

"అవును! ఎలక్షన్లు కూడా దగ్గరకొస్తున్నాయ్ కదా. నాలుగయిదురోజులే కాదు! ఇంకో గంట ఎక్కువయినా ఫరవాలేదు నేను బ్రహ్మాండంగా నిరాహారదీక్ష చేస్తాను" అన్నాడు వెంకట్రావ్.

వెంకట్రావ్ వెళ్ళిపోయాక మా కార్యవర్గం మళ్ళీ అత్యవసర సమావేశం జరిపాము.

"వెంకట్రావ్ నిరాహారదీక్ష చేయటం ఖాయమేగానీ, అతనికి మంచి వంటకాలంటే కొంచెం వీక్‌నెస్ ఉన్న విషయం మీకు గుర్తుందికదా?" అన్నాన్నేను పాత విషయాలు గుర్తుకితెస్తూ.

"అవునవును! ఈడెన్‌గార్డెన్‌లో వాడు చేసిన పని ఎలా మరచిపోతాం!" అన్నాడు శాయిరామ్. ఈడెన్‌గార్డెన్ అనేది ఒక మారేజ్‌హాల్. ఓ రోజు మేమందరం మాట్నీ సినిమాకెళ్ళి ఆ రోడ్ వెంబడివస్తోంటే ఆ పెళ్ళి ఆవరణలో నుంచి నోరూరించే వంటకాల వాసనలు వచ్చి ఎటాక్ చేసినాయ్.

"ఆహా! బగారాబైగన్" అన్నాడు వెంకట్రావ్. హైదరాబాద్ వంటకాల్లో బగారా బైగాన్ (గుత్తి వంకాయకూర) ఒకటన్న విషయం మా అందరికీ తెలుసు.

"అయితే ఏమంటావు?" అడిగాడు గోపాల్రావ్.

"నేను వెళ్ళి భోజనం చేసి వస్తాను-మీరు పదండి!"

"అదేమిటి? ఇది ముస్లిమ్స్ పెళ్ళికదా! వాళ్ళు పిలవందే ఎలా వెళ్తావు?" ఆశ్చర్యంగా అడిగాడు జనార్ధన్.

"అయితేనేం హిందూ ముస్లిం భాయ్! భాయ్! ఖుదా హాఫిజ్!" అనేసి పెళ్ళిలోకి జొరబడిపోయాడు. మేము మా దారినకాలనీ కొచ్చేశాము.

గంటసేపటి తర్వాత అతను కాలనీలో మా ఇంటిముందు నుంచి టిఫిన్ కారియర్ పట్టుకెళ్తూంటే భోజనం చేశాడో లేదో కనుక్కుందామని పిలిచాను.

"భలేవాడివే గురూ! భోజనం చేయకపోవడం ఏమిటి? తీరాచూస్తే ఆ పెళ్ళి ఎవరిదో కాదు! మానాఫీసులో హాకీప్లేయరు నిసార్‌గాడు లేడూ? వాడికి చాలా దూరపు బంధువులదట! నేను నిసార్‌గాడి ఫ్రెండ్‌నని పరిచయం చేసుకుని దూసుకెళ్ళిపోయాను. నాకు బగారా బైగాన్ ఇష్టమన్జెప్పి– కారియర్‌లో కొంచెం కూర ఇమ్మని రిక్వెస్ట్ చేస్తే పాపం ఆ పెద్దమనిషి పేరేంటంటే... ఆ!అబ్దుల్ ఖాదర్– అదే పిల్ల తండ్రి– వెంటనే ఈ టిఫిన్లో బగారా బైగన్ బోలెడు పెట్టి ఇచ్చాడు. టిఫిన్ రేపొద్దున్న వాళ్ళింట్లో ఇచ్చేస్తానని చెప్పాను"

ఇది ఒక్కటేకాదు! ఇలాంటి కథలు కాలనీలో ఎన్నోన్నో జరిగినాయి. యాదగిరి వాళ్ళింట్లో బంగాళాదుంపల బజ్జీలు చేస్తున్నారని తెలిసి అమాంతం వంటింట్లోకెళ్ళి ప్లేటు తీసుకుని కూర్చోవటం, జనార్ధన్ వాళ్ళింట్లో పెసరట్లు వేస్తున్నట్లు వాసనను బట్టి పసిగట్టి లోపలకు దూరి జనార్ధన్ భార్యను అడిగి డజను పెసరట్లు వేయించుకుని తినేయడం– ఇది రాన్రాను చాలామామూలు విషయమైపోయింది మా అందరికీ.

"క్యాకీభాయ్! మనోడు మంచిగా నిరాహారదీక్ష చేస్తాడని నాకు నమ్మకంలేదు!" అన్నాడు యాదగిరి.

ఏదేమయితేనేం వెంకట్రావ్ నిరాహారదీక్షలో ఉన్నన్నిరోజులూ మా కాలనీలో ఎవరూ వాడికిష్టమయిన వంటకాలు చేయకూడదన్న తీర్మానం ఒకటిపాస్ చేశాము. మర్నాడు పొద్దున్న గోపాల్రావ్ అన్ని పేపర్లలోనూ వెంకట్రావ్ ఫోటో వేసి నిరాహారదీక్ష ప్రారభించబోతున్న న్యూస్ రాయించేశాడు.

దాంతో మా ఏరియాలో పెద్ద సంచలనం చెలరేగింది.

మా కాలనీ అవతల దూరంగా ఉన్న వీకర్ సెక్షన్‌కాలనీ వాళ్ళంతా పదిగంటల కల్లా ఆనందంగా మా కాలనీ కొచ్చేశారు– నిరాహారదీక్ష తంతు చూద్దానికి.

మేళ తాళాలతో రోడ్డు పక్కనే ఉన్న పెద్దషామియానాలోకి వెంకట్రావ్‌ని తీసుకెళ్ళాం. వెంకట్రావ్‌కి ఎక్కడిదో రాజకీయ నాయకుడి డ్రస్ తగిలించారు మావాళ్ళు.

నిజం చెప్పొద్దూ! ఆవేషం వాడికి సూటయింది! ఇక గుణగణాలంటారా! అవీ రాజకీయ నాయకుడి గుణాలకు దగ్గరగానే ఉన్నాయ్. ఆఫీసులో లంచాలు పడుతుంటాడు! మందు

కొడుతుంటాడు! ఇలా మరిన్ని చిల్లర దురలవాట్లు ఉండనే ఉన్నాయ్! అంచేత రాజకీయాల్లోకి దిగాలనేవాడి కోరికలో అసమంజసం ఏముంది? షామియానాలోకి రాగానే మా కాలనీ వాళ్ళు రెండు దండలు వేశారు మెడలో. ఆ తరువాత వీకర్ సెక్షన్ కాలనీ వాళ్ళందరూ కలిసి ఓదండవేసి మొఖానికి బొట్టుపెట్టారు. ఎందుకంటే ఆరోడ్ పాడవటం మూలాన ఆర్టీసీ బస్‌లు ఆరోడ్డుమీద తిరగడం మానేసినయ్. ఆటోరిక్షాలవాళ్ళు, రిక్షావాళ్ళూ ఆ రోడ్డుమీద ససేమిరా నడపడానికి వప్పుకోవటంలేదు. ఇందువల్ల మాతోపాటు ఆ కాలనీ వాళ్ళు కూడా నరకయాతన అనుభవిస్తున్నారు.

వెంటనే మేమంతా నినాదాలు ప్రారంభించాం.

"వెంకట్రావ్" అన్నాడు యాదగిరి. "జిందాబాద్" అన్నాం మేము.

"ప్రజలకోసం ప్రాణాలర్పించడానికి సిద్దపడి నిరాహారదీక్ష చేస్తున్న వెంకట్రావ్"– "వర్ధిల్లాలి"

"దేశ్ కీ నేతా–"

"వెంకట్రావ్ బన్‌తా!"

"దేశ్‌కీ నేతా కై సేహెూ!"

"వెంకట్రావ్ జైసేహెూ!"

"వెంకట్రావ్ వెంకట్రావ్!"

"జిందాబాద్– జిందాబాద్!"

వెంకట్రావ్ షామియానాలో ఏర్పాటు చేసిన పరుపుమీద కూర్చున్నాడు. ఈరోజు ఆదివారం కాబట్టి అందరం షామియానాలోనే గడిపాము.

సాయంత్రంమయేసరికి వెంకట్రావ్‌కి భోజనం మీదకు మనసు మళ్ళినట్లుంది.

"మీ ఇంట్లో ఏం కూర?" అని అందరినీ అడగడం ప్రారంభించాడు.

మేము ముందే ఏం చెప్పాలో నిర్ణయించుకుని ఉండడం వల్ల "అబ్బే! కూరేంలేదు. పచ్చడీ, చారునూ! అసలే ఎండలు కదా! కూరగాయలు దొరకటం లేదు!" అంటూ చెప్పేశాము. కొద్దిసేపు సైలంటుగా ఉన్నాక–

"పోనీ రాత్రి పొద్దుపోయాక కొంచెం పచ్చడన్నం లాగిస్తాను ఏమంటారు." అన్నాడు హఠాత్తుగా.

అందరం అదిరిపడ్డాం.

"అదేమిటి? నిరాహారదీక్ష ప్రారంభించాక పచ్చడన్నం అంటావేమిటి?"

"ఆ! ఎవరు చూస్తారులెద్దూ! అంతా మన కాలనీ వాళ్ళేగా!"

"అయినాగాని అట్లాతినొద్దు తమ్మీ! గట్ల చేస్తేగలత్ అవుతది! నేనే నిన్ను అరెస్ట్ జేయాలమళ్ళా!" అన్నాడు ఓ మీసాలతను. అందరం ఆ మీసాలతని వంక ఆశ్చర్యంగా చూశాం! అవి మా కాలనీ తాలూకూ మీసాలుకావు. మా కాలనీలో మీసాల్రావ్‌లెవరూలేరు.

"మీరెవరు?" మర్యాదగా అడిగాము.

"పోలీస్‌డిపార్ట్‌మెంట్! ఈ నిరాహారదీక్షలు చేసేటోళ్ళు గిసంటి దందాలు చేయకుండా మఫ్టీలో పహరా కొచ్చినా"అన్నాడతను. వెంకట్రావ్ మొఖం మాడిపోయింది.

"అబ్బే మా వాడు 'జోక్' కోసం అంటున్నాడంతే!" అన్నాం మేముసర్దేస్తూ.

"అవున్సార్! ప్యూర్ 'జోక్' అంతే!" అన్నాడు వెంకట్రావ్ కూడా అతి కష్టంమీద నవ్వుతూ.

"ఆయనెప్పుడూ అంతేనన్నా! భోజనం చేస్తా, చేస్తానని దిల్లగీ చేస్తుంటాడు!" అన్నాడు యాదగిరి! మీసాలకానిస్టేబుల్ మా మాట నమ్మాడు.

ఆ రాత్రి గడిచిపోయింది.

మేమంతా ఆ సాయంత్రం పెద్ద ఊరేగింపుతో మున్సిపాల్ కార్పొరేషన్ కెళ్ళి స్పెషల్ ఆఫీసర్‌కి ఒ మెమొరాండం అందజేయాలని నిర్ణయించుకున్నాం.

తీరా ఆఫీస్‌నుంచి వచ్చేసరికి అక్కడి దృశ్యం భయం కలిగించింది. షామియానా కెదురుగా ప్రభుత్వమొబైల్ కాంటీన్‌వాన్ ఆగివుంది. అందులో వివిధ రకాల ఫలహారాలు వాసనలు ఘుమఘుమలాడుతూ బయటికొస్తున్నాయ్.

వెంకట్రావ్ ఆ కాంటీన్ వేపే గుడ్లప్పగించి చూస్తున్నాడు. మా కాలనీ పిల్లలు కొంతమంది అప్పటికే వాన్ చుట్టుచేరి మిరపకాయబజ్జీలు తినేస్తున్నారు. నేనూ, యాదగిరి హడావిడిగా వాన్ దగ్గరికెళ్ళాం.

"ఈ వాన్ ఈడకెళ్ళి తీసెయాలి జల్దీ" అన్నాడు యాదగిరి డ్రైవరుతో. డ్రైవర్ చిరునవ్వు నవ్వాడు.

"ఎందుకు తీయాలిసార్! ఇది మీ సొంతభూమా?"

"కాకపోయినాగానీ మా కాలనీ వాళ్ళ అనుమతి లేనిదే లోపలకురావద్దు."

"మాకు పోలీస్ కమీషనర్‌గారు పర్మిషనిచ్చారు!"

ఇద్దరం ఉలిక్కిపడ్డాం.

"పోలీస్ కమీషనర్‌గారా!"

"అవును!"

"ఆయనెందుకిచ్చారు పర్మిషన్?"

"ఇయ్యాళరేపు ఈ నిరాహారదీక్షలు బంద్ చేయడానికి కొత్త అయిడియా చేసిన్రు. గిట్లా కాంటిన్లు పెట్టి నిరాహారదీక్ష చేసేటోళ్ళకు ఫలహారాలు సూపిస్తే ఆళ్ళు ఆ దీక్షబంద్ చేసి తినెడిది షురూచేస్తరు."

మా కందరికీ కాళ్ళుచేతులూ వణకసాగినాయ్.

మిగతా వంటకాలు చేసినన్ని రోజులూ వెంకట్రావ్‌ని ఎలాగోలా ఆపవచ్చుగానీ, ఆలూ బజ్జీలూ, పెసరట్లు బగారా బైగన్ తయారుచేస్తే మాత్రం వెంకట్రావ్‌ని భగవంతుడు కూడా ఆపలేడు.

ఈలోగా వీకర్ సెక్షన్ కాలనీవాళ్ళు ఊరేగింపుగా వచ్చేశారు మా కాలనీకి. "పదండ్రి జల్దీ!" అన్నారు వాళ్ళ లీడర్లు. అప్పటికప్పుడే మా కాలనీవాళ్ళు ఆడామగా అంతా ఊరేగింపులో కలిసిపోయాం. వెంకట్రావు మొబైల్ కాంటీన్‌కెళ్ళకుండా యాదగిరిని కాపలా పెట్టాం. ఆడావాళ్ళజట్టుకి రాజేశ్వరి నాయకత్వం వహించింది.

"మనిషికి కూడూ బట్టే కాదోయ్, రోడ్డు కూడా ఉండాలోయ్" అంటూ పాటలు పాడుతున్నారు కొంతమంది.

మెమొరాండం సమర్పించాక తిరిగివచ్చేటప్పుడు, ఆర్టీసి బస్సులమీద రాళ్ళురువ్వారు మాలో కొంతమంది! ఏమిటంటే శాస్త్రంకోసం రువ్వారట– ఆనవాయితీ చెడగొట్టకూడదని! మేము వెంటనే అడ్డుపడి ఆపివేశాము.

మర్నాడు పేపర్లో వార్త మాకందరికీ ఆశ్చర్యం కలిగించింది.

"మంత్రిగారు స్వయంగా మా కాలనీ రోడ్డు స్థితి సమీక్షించేందుకు మరో రెండురోజుల్లో వస్తున్నారట! అయితే వారొచ్చేలోగా నిరాహారదీక్షలు ఆపేయాలట!"

అప్పటికప్పుడు ఎమర్జెన్సీ మీటింగ్ జరిపాము.

"ఇదంతా మోసం! మనవాడు నిరాహారదీక్ష ఆపేశాడంటే మళ్ళీ రోడ్డుగతి ఎవరూ పట్టించుకోరు!" అన్నాడు గోపాల్రావ్.

"అవును! రామగిరి కాలనీలో అలాగే జరిగింది కదా!" అన్నాడు రెడ్డి.

ఆ సాయంత్రం పోలీస్ కమీషనర్ స్వయంగా మా కాలనీకొచ్చారు, వ్యాన్ వేసుకుని. ఆయనతోపాటు మరికొంతమంది అధికారులు–

అందరూ షామియానా కెదురుగ్గానే కుర్చీలు రకరకాల ఫలహారాలు ప్లేట్లో తీసుకుని వేడివేడిగా తినసాగారు మా అందరికీ కూడా నోరూరిపోతోంది. వెంకట్రావ్‌కి ఆ దృశ్యాలు కనబడకుండా కొంతమంది అడ్డునిలబడ్డాం. అక్కడ మూగిన కాలనీ పిల్లలని పిలిచి ఉ చితంగా బజ్జీలు, సమోసాలు ఇచ్చారు పోలీసులు.

మేము పిల్లలను చావగొట్టి ఫలహారాలు వాపస్ చేసేశాము. లేపోతే వెంకట్రావ్ లేచివెళ్ళి ఆ ఫ్రీసరుకు తినేస్తాడేమోనని అనుమానం.

ఈలోగా మఫ్తీలో కొంతమంది కానిస్టేబుల్స్ కాలనీ అంతా తిరిగి వెంకట్రావ్ కిష్టమయిన వంటకమేదో తెలుసుకోడానికి ప్రయత్నించసాగారు. ఈ సంగతి తెలియగానే మేము పిల్లలందరినీ అన్ని ఇళ్ళకూ పరిగెత్తించి వెంకట్రావ్ కిష్టమైనది 'బగారా బైగన్' అన్న సంగతి పోలీసులకు తెలియనీయవద్దని హెచ్చరికలు చేశాము.

తమప్లాను పారకపోయేసరికి పోలీసు కమీషనర్‌గారు కొత్త పథకం ఆలోచించారు. పూటకు అయిదారురకాల వంటకాల చొప్పున తయారు చేసి వెంకట్రావ్‌కి కినిపించేలా తినాలని ప్లాను! అందులో వెంకట్రావ్ కిష్టమయిన వంటకం ఉంటే అతగాడు ఇక ఎగిరిదూకి వచ్చేస్తాడని అయిడియా.

అదృష్టవశాత్తూ వాళ్ళు ఆరోజు వండిన వంటకాలలో బగారా బైగన్ రాలేదు. ఓ పక్క వెంకట్రావు పరిస్థితి విషమించిపోతోంది. "ఇంక చాల్లెండి! నాకాకలేస్తోంది. నేనుండలేను కావాలంటే మరోసారి ఇంకో రెండు రోజులు చేస్తాను నిరాహారదీక్ష!" అనడిగాడు అసహనంగా ఆకలి చూపులు చూస్తూ–

"పిచ్చివాడా! అంత తొందరెందుకు? ఓపక్క అసెంబ్లీలో నీ నిరాహారదీక్ష గురించి గొడవచేయిస్తున్నాం! ఇంకొక్కరోజు ఓపిక పట్టుచాలు! ఈలోగా ఎవరోకరి హామీ అయినా తీసుకుందా కనీసం" అంటూ నచ్చజెప్పాము.

సరిగ్గా అప్పుడే కమీషనరుగారు ఓ ప్లేట్లో వేడివేడి బజ్జీలు వేసుకొచ్చి ఎదురుగ్గా నిలబడి మా అందరికీ ఆఫర్ చేసేసరికి వెంకట్రావు స్ప్రింగులా ఎగిరినిలబడ్డాడు అందుకోటానికి. అతని చేయి ప్లేట్లోకి వెళ్తూండగా మేమంతా ఒక్క దూకుదూకి వాడి చేయి వెనక్కు విరిచేసి వాడిని కిందపడేసి లేవకుండా నొక్కి పట్టాము.

పోలీస్ కమీషనర్ చిరునవ్వునవ్వాడు. "మీ అందరినీ అరెస్ట్ చేస్తున్నాను" అన్నాడు నా దగ్గరకొచ్చి.

"ఎందుకు?"

"ఒక వ్యక్తిని నిర్బంధించి తిండి పెట్టకుండా హత్యచేయడానికి ప్రయత్నిస్తున్నందుకు."

"అతను నిరాహారదీక్ష చేస్తున్నాడండీ! మేమెక్కడ నిర్బందించాం"

"మరి అదేమిటి? పాపం అతనికిష్టమయినా ఆలూబజ్జీలు తినకుండా అతనిమీద కూర్చున్నారు! ఇది నిర్బంధం కాదూ!"

"కాదు"

"మర్యాదగా అతనిని స్వేచ్ఛగా వదులుతారా, లేక మిమ్మల్ని వాన్‌లో స్టేషన్‌కి తీసుకెళ్ళమంటారా?" అందరం చేసేదిలేక దూరంగా జరిగాము.

వెంకట్రావ్ నెమ్మదిగా లేచాడు. అతని దృష్టి అంతా కమీషనర్ చేతిలో ఉన్న బజ్జీల ప్లేట్ మీదే వుంది. హఠాత్తుగా యాదగిరికో అయిడియా వచ్చింది.

కెవ్వున నినాదాలు ప్రారంభించేశాడు.

"వెంకట్రావ్– వెంకట్రావ్"

"జిందాబాద్– జిందాబాద్" అంటూ అరచారు ఆడా, మగా అందరూ,

"రేపు ఎలక్షన్‌లో నిలబడబోయే వెంకట్రావ్!"

"వర్ధిల్లాలి!"

"ఆలూబజ్జీలు"

"రేపు తినొచ్చు–"

"ఉల్లిపాయ పెసరట్లూ."

"రేపు తినొచ్చు!"

"బగారా… " మూడో స్లోగన్ ఇవ్వబోతుంటే నేను ఠక్కున యాదగిరినోరు మూసేశాను.

"అది పోలీసులకు తెలియకూడదురా పక్షీ! తెలుస్తే అది వండి వాడికి చూపించారంటే వాడ్నింక ఎవరూ ఆపలేరు."

"అవ్ అన్నా" అనేసి నినాదం మార్చేశాడు యాదగిరి.

"ఆలూ బజ్జీ– పెసరట్టు"

"రేపు తినొచ్చు బోలెడు తినొచ్చు"

"ఇవాళ్ళ మాత్రం"

"ఛీ ఛీ! వద్దే వద్దు–"

"పోలీస్ కమీషనర్ బజ్జీలూ–"

"డౌన్ డౌన్–"

"పోలీస్ కమీషనర్ కాంటీనూ"

"గో బాక్! గో బాక్–"

మా కేకలు వెంకట్రావ్‌లో కొంచెం సంచలనం కలిగించినట్లుంది, వెనక్కు తగ్గి పరుపు మీద కూలబడ్డాడు మళ్ళీ. ఎప్పటికప్పుడే వెంకట్రావు పేరుతో జైజై నినాదాలుతో మోతెక్కించేశాడు యాదగిరి.

పోలీస్ కమీషనర్ ముఖం చిన్నబోయింది. కసిగా బజ్జీలన్నీ తనే తినేశాడు. ఇక్కడీ గొడవ జరుగుతుండగా, మాకు తెలీకుండా ఇంకో వ్యవహారం చాటున జరిగిపోయింది.

ఈలోగా కాలనీ పిల్లలందరినీ వాన్‌లో సరదాగా షికార్లు తిప్పుతామని తీసుకెళ్ళి వాళ్ళందరికి చాక్‌లెట్లు, బిస్కెట్లు ఇచ్చి పోలీస్ ఇన్‌స్పెక్టర్లు– వెంకట్రావు కిష్టమయిన వంటకం గురించి తెలుసుకోవడానికి ప్రయత్నించారట!

మొదట్లో మా కాలనీ పిల్లలు చెప్పటానికి నిరాకరించారటగానీ, చివరకు వాళ్ళు మన ఇండియా క్రికెట్ టీమ్ ఫోటోస్ ఉన్న ఆల్బమ్ అందరికీ తలోటీ ఇస్తామనేసరికీ రహస్యం కాస్తా చెప్పేశారు. అయితే మేము చావగొడతామని ఈ విషయం మాకు చెప్పనేలేదు.

మర్నాడు మొబైల్ కాంటిన్ వాళ్ళు గుత్తివంకాయలు తెచ్చి మసాలా నూరడం కనిపించేసరికి మా పై ప్రాణాలు పైనేపోయాయి. ఆ దృశ్యం వెంకట్రావుకి కనపడకుండా యాదగిరి బోలెడుమంది కాలనీ వాళ్ళను కూడగట్టుకొని గోడలాగ అడ్డునిలబడ్డాడు.

"ఆ కూర రెడీ అయ్యేలోపల ఎవరొకముఖ్య అధికారినో, లేక ఏ ఛోటారాజకీయ నాయకుడినో తీసుకొచ్చి తను ఈ విషయంలో జోక్యం కలుగజేసుకుంటున్నట్లూ అంచేత రోడ్డు రిపేరు విషయం తనకొదిలేయమని హామీ ఇచ్చి, వెంకట్రావుని నిరాహారదీక్ష విరమించమనికోరి నిమ్మకాయనీళ్ళు ఇచ్చేసే ఏర్పాట్లు చేయడానికని శాయిరామ్, గోపాల్రావులు టాక్సీలో తిరగసాగారు.

ఈలోగా యాదగిరి పాలిపోయిన మొహంతో మా దగ్గరకొచ్చి రహస్యంగా ఓ విషయం చెప్పాడు.

"అదేంటంటే జంట నగరాల్లోకంతటికీ బగారా బైగన్ అద్భుతంగా వండగల పూరానాపూల్ జాఫర్ అనే గజవంటగాడిని పిలిపించారట కమీషనర్‌గారు! ఆవార్త విన్నాక ఎవరి మొఖాల్లోనూ రక్తంలేదు. ఇంక మా పరువుని రక్షించడం ఎవరివల్లాకాదు. కేవలం హైదరాబాద్ నిజాం నవాబుతాలూకూ కుటుంబసభ్యుల వివాహాలకే జాఫర్ బగారా బైగాన్ వండుతాడని మిగతావారి నెవ్వరిని లెక్కచేయడనీ– అతని వంటకం రుచి చూడానికి ఢిల్లీ నుంచి కూడా గొప్పగొప్పోళ్ళు ప్రత్యేకంగా భోజనాని కొస్తారనీ మేమందరం కథలు విన్నాం! మరి కాసేపట్లో బగారా బైగన్ ఘుమ ఘుమలు మా కాలనీ అంతా వ్యాపించినయ్. పోలీస్‌కమీషనర్‌గారు వాళ్ళ షామియానాలో ఠీవిగా, సంతోషంగా, మమ్మల్ని దెబ్బకొట్ట బోతున్న ఆనందంతో చిరునవ్వులు చిందిస్తూ కూర్చున్నారు.

పూరానాపూల్ జాఫర్ బగారాబైగాన్ వండుతున్నాడన్న విషయం తెలిసి కాలనీలోని ఆడాళ్ళందరూ అతనెలా వండుతున్నాడో చూసి నేర్చుకోవాలని అక్కడగుమికూడిపోయారు.

"మీరందరు కూడా ఈ పూట ఇక్కడే భోజనం చేయండమ్మా! ఏం ఫరవాలేదు. కన్సెషన్ రేటు!" అంటున్నాడు కమీషనర్!

"అలాగే నండీ– ఈ బగారా బైగన్ కర్రీని పురానాపూల్ జాఫర్ వండే పద్ధతి కూడా ఓ కాగితం మీద రాయించి ఇవ్వండి" అంటూ ఆయనను అడుగుతున్నారు లేడీస్ అంతా కలిసి.

మా అందరికీ మా ఆడాళ్ళమీదే వళ్ళు మండిపోతోందిగానీ ఏం చేయగలం! మరికా సేపట్లో బగారాబైగన్ వాసనలు మరింత విజృభించినయ్. నిజం చెప్పొద్దూ? మాకే నోరూరుతోంది! ఆ వాసన షామియానా వేపు రాకుండా ఎదురుగ్గా ఫాన్‌లు పెట్టాం మేము– అయినా "హా" అంటూ గాలి బాగా పీల్చాడు వెంకట్రావ్. "అది బగారా బైగన్! పూరానాపూల్ జాఫర్ వండుతున్నాడు" అన్నాడు తన్మయత్వం పొందుతున్నట్లు కళ్ళుమూసుకుని.

"నీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగాము. లక్షమంది ఒకేసారి బగారాబైగన్ వండుతున్నా సరే! అందులో పూరానాపూల్ జాఫర్ వంటకం ఒక్కసారి వాసన చూస్తే చాలు గుర్తు పట్టేస్తాను. ఆహా! అబ్బ చూశారా! ఇంతమంచి వాసనలు ఇంకెవరివల్లాకాదు. ఆహా! ఆహా! బగారా బైగన్– పురానాపూల్ జాఫర్ బగారా బైగన్!".

మేము శాయిరామ్ వాళ్ళ టాక్సీకోసం ఆతృతగా ఎదురు చూడసాగాం! ఈ వెధవ ఇంక కొద్దిక్షణాలకంటే ఎక్కువ మా చేతుల్లో ఉండడని తెలిసిపోతోంది.

"ఆ? భోజనంరెడీ!" అంటూ అరిచారు కమీషనర్‌గారు.

మరుక్షణం, సబిన్‌స్పెక్టర్లు, కానిస్టేబుల్స్ అందరూ బఫేడిన్నర్ ప్రారంభించేశారు. "ఎవరయినా సరే భోజనం చేయవచ్చు! కన్సెషన్‌రేట్‌లో ఇస్తున్నాం! ఈ కన్సెషన్ కేవలం ఈ కాలనీ వాళ్ళకు మాత్రమే!" స్పీకర్‌లో పోలీస్‌వాన్‌లో నుంచి వినబడింది, ఎనౌన్స్‌మెంట్.

"కొంచెం అడ్డంలేవండి! బగారా బైగాన్ ఎలావుందో వూరికే చూస్తాను–" అన్నాడు వెంకట్రావ్ స్పృహలోలేనట్లు ఆవాసనల్లో మునిగిపోయి–

"అక్కర్లేదులే! అలా కూర్చో! రేపు జాఫర్‌కి ఎంత డబ్బయినా ఇచ్చి నీకు వండించి పెడతాం!" అన్నాడు రెడ్డి.

"ఒక్కసారి లేవండి! చాలు! దగ్గర్నుంచి ఆ ఘుమఘుమలు పీల్చివచ్చేస్తా!" బ్రతిమాలసాగాడు వెంకట్రావ్. ఈలోగా కమీషనర్‌గారు స్వయంగా ఓ పెద్ద ప్లేటునిండా బగారాబైగన్ కూర పొగలు కక్కేవేడిది వడ్డించుకుని మరో ప్లేటులో చపాతీలు తీసుకొచ్చి వెంకట్రావ్‌కి కనిపించేట్లు ఓ కుర్చీలో కూర్చుని తినడం ప్రారంభించాడు. వెంకట్రావ్ నోరు వెళ్ళబెట్టేశాడు. గుడ్లు మిటకరించాడు, నాలుక తడుపుకుంటూ, పెద్ద ఎత్తున రొప్పుతున్నాడు "ఆహా– నా ప్రాణం– బగారా బైగన్– నా దేవుడు పురానాపూల్ జాఫర్" అంటూ సంధి వచ్చినట్లు గొణుగుతున్నాడు. నోట్లోనుంచి లాలాజలం చుక్కలుగా రాలుతోంది. నెమ్మదిగా

ఆప్లేటువంకే చూస్తూకూర్చున్నచోటు నుంచి లేచాడు. పరిస్థితి విషమించి పోతోందని గమనించి యాదగిరి నినాదాలు ప్రారంభించాడు.

"వెంకట్రావ్-వెంకట్రావ్" "జిందాబాద్- జిందాబాద్"

"పోలీసుల నక్కజిత్తులకు-" "వెంకట్రావ్ లొంగడు- లొంగడు-"

"పోలీస్ కమీషనర్" "డౌన్ డౌన్"

"వర్ధిల్లాలి! వర్ధిల్లాలి- వెంకట్రావ్ మనోనిబ్బరం వర్ధిల్లాలి-"

పోలీస్ కమీషనర్ వెంకట్రావ్ వేపు చిరునవ్వుతో చూశాడు. ఆయన చేతిలో నూనె కారుతున్నవంకాయ చూసేసరికి వెంకట్రావ్‌కి ఏదో పూనకం వచ్చినట్లయింది. మా అందరిచేతులూ ఎక్కడలేని బలంతో విదిలించుకొని పోలీస్ షామియానా వేపు పరిగెత్తాడు. యాదగిరి ఇంకా ప్రయత్నాలు మానలేదు.

"వెంకట్రావ్ వెంకట్రావ్"

"జిందాబాద్ జిందాబాద్"

"పోలీస్ వాళ్ల బగారా బైగాన్‌కి"

"మహాత్మా వెంకట్రావ్‌లొంగడు"

"వెంకట్రావ్ నిగ్రహం"

"వర్ధిల్లాలి- వర్ధిల్లాలి"

"పోలీస్ కమీషనర్ బగారా బైగాన్"

"డౌన్ డౌన్" వెంకట్రావ్‌కి ఏమీ వినిపించటంలేదు. పిచ్చివాడిలా బఫేటేబుల్ దగ్గరకు నడిచాడు. ఆ తరువాత అంతా క్షణాల్లో జరిగిపోయింది. వెంకట్రావ్ పెద్ద ప్లేట్లో బగారా బైగాన్ వేడిగా వడ్డించుకొని ఆవురావురుమని తినేస్తున్నాడు.

మరుక్షణం నినాదాలు మారిపోయాయి.

"వెంకట్రావ్" "డౌన్ డౌన్"

"వెంకట్రావ్ బగారా బైగాన్" "నశించాలి"

అప్పుడే శాయిరామ్ వాళ్ళు ఎమ్మెల్యేలతో సహాకార్లో వచ్చేశారు.

"నిమ్మకాయ నీళ్ళు సిద్ధంగా ఉంచారా?" అడిగారాయన షామియానా దగ్గరకొచ్చి. ఈలోగా పోలీస్‌కమీషనర్‌గారు ఆయన క్కూడా బగారా బైగన్ కూర- చపాతీలు ప్లేట్లు తీసుకొచ్చి అందించేసరికి ఆయనకూడా మాట్లాకుండా తినేసారు. మరి కాసేపటికి కాలనీలో పిల్లా పెద్దా అందరూ కన్సెషన్ టికెట్లు కొనుక్కుని క్యూలో నిలబడి భోజనం చేయటం కనిపించింది.

కేవలం మా కార్యనిర్వహక వర్గం వాళ్ళు మాత్రం దూరంగా నిలబడ్డాం.

నిరాహారదీక్షలు మొదలుపెట్టడం– ఆ తరువాత రోజులు గడిచినకొద్దీ అది అల్లరికీ, దౌర్జన్యానికీ, ఆస్తినష్టానికీ దారితీయటం– ఇలా జరగకుండా మేము ఈ కొత్తపద్ధతి ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టాం! విజయవంతంగానే జరిగింది గనుక త్వరలో ఇది దేశమంతా ప్రవేశపెట్టాలని సిఫార్సుచేస్తాం!" అన్నారు కమీషనరుగారు.

మేము "ఇహిహి" అంటూ చిరునవ్వు నవ్వాము వెంకట్రావ్ వేపు కోపంగా చూస్తూ.

